క్లుప్తంగా

క్రీడాకారులకు ఆర్థికసాయం



దోమలపెంట: గ్రామానికి చెందిన ఎలిశెట్టి శ్రీను ఆయన తండ్రి వీరయ్య జ్ఞాపకార్థం క్రీడాకారులకు క్రీడా సామగ్రి కొనుగోలు కోసం రూ.20వేల నగదును బుధవారం అందజేశారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆర్థికసాయం అందించినట్లు శ్రీను తెలిపారు. కార్యక్రమంలో కటకం వెంకటేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

తెలకపల్లి: మండలంలోని చిన్నముద్దునూరులో సర్వే నంబర్ 300లో కొందరు అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారని కలెక్టర్, తహసీల్దార్‌కు అదే గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డి బుధవారం ఫిర్యాదు చేశాడు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. విషయమై తహసీల్దార్ మురళీమోహన్‌ను వివరణ అడగగా అక్రమ నిర్మాణాల గురించి తమ దృష్టికి వచ్చిందని, ఆర్‌ఐతో విచారణ చేయిస్తామని తెలిపారు.

ఆదర్శ కమిటీ ఎన్నిక



తెలకపల్లి: మండలంలోని ఆలేరులో ఆదర్శ యూత్ అసోసియేషన్ నూతన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం గ్రామంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. 15 సంవత్సరాలుగా వివిధ సామాజిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామ నూతన అడక్ కమిటీ అధ్యక్షుడిగా ఉస్మానియా యూనివర్సిటీ స్కాలర్ పి రాజీవ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎం రమేష్, ఉపాధ్యక్షుడిగా ప్రవీణ్, కోశాధికారిగా మల్లేష్, కమిటీ కార్యవర్గ సభ్యులుగా గణేష్, నరేష్, శివ, కుమార్, ప్రచార కార్యదర్శులుగా ఎల్లస్వామి, భాస్కర్, తదితరులను ఎన్నుకున్నారు.

ఈదమ్మమాందాతకు ప్రత్యేక పూజలు



వెల్దండ: మండలంలోని చెర్కూర్‌లో ఈదమ్మ మాందాతకు గోలి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలు ముగింపు సందర్భంగా అమ్మవారికి వస్త్రాలను, నైవేద్యం సమర్పించారు. నాయకులు మాజీ ఎంపీటీసీ భీమయ్యగౌడ్, మైసయ్య, ఉప సర్పంచ్ నర్సింహ్మముదిరాజ్, నాయకులు సత్యం, అలీలోద్దీన్, శ్రీనునాయక్, ప్రశాంత్, రాంచందర్‌గౌడ్, లాలయ్య, శ్రీను, అంజీనాయక్ ఉన్నారు.

చెన్నకేశవస్వామి ఆలయంలో..



తాడూరు: మండల కేంద్రంలోని స్థానిక చెన్నకేశవస్వామి ఆలయంలో అయోధ్యలో శ్రీరామ మందిర ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కలశపూజ నిర్వహించారు. రోజువారిగా ప్రత్యేక పూజలు నిర్వహించాలని వీహెచ్‌పీ నాయకులు కోరారు. కార్యక్రమంలో వీరాచారి, పూజారులు జగదీశ్వరాచారి, స్వామి, కృష్ణయ్య, పవన్‌కుమార్, శంకరయ్యలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఇరుముడి



కొల్లాపూర్: పట్టణంలోని ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయంలో బుధవారం భక్తిశ్రద్ధలతో ఇరుముడి ధారణ కార్యక్రమం నిర్వహించారు. గురుస్వామి బీఎస్‌కే భాస్కర్ సమక్షంలో అయ్యప్ప మాలధారులు ఇరుముడిని స్వీకరించారు. ఈ సందర్భంగా అయ్యప్ప నామస్మరణ మార్మోగింది. అంతకుముందు ఆలయంలో సామూహిక బిక్ష ఏర్పాటు చేశారు. అనంతరం భజన, కీర్తనలు చేస్తూ స్వాములు శబరిమలకు బయలుదేరారు. కార్యక్రమంలో మురళి, శ్రీరామ్, రాఘవేంద్ర, రామసుబ్బారెడ్డి, వెంకటరాజు, భక్తులు పాల్గొన్నారు.

పనులు పూర్తయ్యేనా?

- ముందుకు సాగని పంచాయతీ భవన నిర్మాణాలు
- నేటికి పూర్తికాని భవనాలు



అద్దె భవనంలో గాన్‌గట్టుతండా పంచాయతీ



కేస్లీతండాలో స్లాబ్ వరకు నిర్మించిన పంచాయతీ భవనం

వెల్దండ: ప్రజలకు పాలన చేరువయ్యేందుకు కొత్తగా గ్రామ పంచాయతీలను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పాత పంచాయతీ గ్రామాలకు పక్కా భవనాలు నిర్మాణాలకు చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా పలు గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో పలు గ్రామాల్లో పనులు కూడా ప్రారంభించారు. కొన్ని నెలలు గడుస్తున్నా పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. మరికొన్ని రోజుల్లో సర్పంచుల పదవికాలం కూడా ముగుస్తున్నా ఇప్పటికి పనులు అసంపూర్తిగా ఉండటంతో ఆయా గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మొత్తం 32 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రభుత్వం గ్రామ పంచాయతీలను పరిశీలించి నూతనంగా 20 భవనాలను మంజూరు చేశారు. ఇందులో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద 9 పంచాయతీలకు, గిరిజన ప్రత్యేక నిధుల కింద 11 పంచాయతీలకు భవనాలు 6 నెలల కిందట మంజూరు చేశారు. భవనాల నిర్మాణానికి ఒక్కొక్క భవనానికి రూ.20లక్షల చొప్పున నిధులు కేటాయించారు. పనులు చేసినచోట నేటికి బిల్లులు అందకపోవడంతో ప్రజాప్రతినిధులు ఆందోళన చెందుతున్నారు.

నిధులు మంజూరు

కొత్తగా ఏర్పడిన 20 గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం నూతన భవనాలను మంజూరు చేసింది. ఒక్కో పంచాయతీ భవన నిర్మాణానికి రూ.20లక్షలు మంజూరు చేశారు. భవనాలను నిర్మించడానికి కొన్ని చోట్ల స్థలాల సమస్య, మరో చోట ఉన్న స్థలాలకు ఆటంకాలు ఎదురయ్యాయి. జాతీయ ఉపాధి హామీ పథకంలో భర్కత్‌పల్లి, రాఘయపల్లి, కంటోనిపల్లి, గుండాల, లింగారెడ్డిపల్లి, తిమ్మినోనిపల్లి, బండోనిపల్లి, పల్గుతండా, పోషమ్మగడ్డ తండాలకు పంచాయతీ భవనాలు మంజూరయ్యాయి. తొమ్మిది పంచాయతీలల్లో నాలుగు చోట్ల స్లాబ్ వరకు నిర్మించారు. మరో మూడు చోట్ల పిల్లర్లకే పరిమితమయ్యాయి. రెండో చోట్ల స్థలాల కొరత ఉండడంతో పనులను ప్రారంభించలేదు. అదే విధంగా గిరిజన ప్రత్యేక నిధుల కింద అల్లంతోటబావితండా, గాన్‌గట్టుతండా, కేస్లీతండా, కుందారంతండా, ఎంజీ కాలనీతండా, మర్రిగుంతతండా, నగారగడ్డతండా, నారాయణపూర్‌తండా, శంకరకొండతండా, సిలోనిబావితండా, ఉబ్బలగట్టుతండాలకు భవనాలు మంజూరయ్యాయి. 11 గిరిజన గ్రామ పంచాయతీలకు భవనాలల్లో కేవలం కేస్లీతండాలోనే పనులు చేపట్టి స్లాబ్ వరకు నిర్మించారు. మిగిలిన గ్రామ పంచాయతీలల్లో స్థలాల కొరత, టెండర్లు సమస్య ఉండడంతో 10 చోట్ల పనులను ప్రారంభించలేదు.

ఏళ్లుగా అద్దె భవనాల్లోనే..

నూతనంగా ఏర్పాటైన 20 గ్రామ పంచాయతీలకు ప్రత్యేక భవనాలు లేవు. దీంతో సర్పంచ్‌లు అద్దె భవనాల్లో వారి పదవి కాలం పూర్తి చేసుకున్నారు. ఏళ్లుగా అద్దె భవనాలల్లో పంచాయతీ పాలన వ్యవస్థను నిర్వహించుకున్నారు. జనవరి 31వ తేదీతో సర్పంచుల పదవి కాలం ముగియనుంది. ఇప్పటికైన జిల్లా ఉన్నత అధికారులు స్పందించి నూతనంగా ఏర్పాటైన ప్రత్యేక పంచాయతీలకు భవనాలను పూర్తిచేసి ఉంచాలని వారు కోరుతున్నారు.

స్థలం లేదు



ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటైన తండాకు ప్రభుత్వం గ్రామ పంచాయతీ భవనాన్ని మంజూరు చేసింది. గ్రామంలో స్థలం కొరతతో పనులు ప్రారంభించలేదు. చేసేదేమీ లేక అద్దె భవనాల్లోనే పంచాయతీ నిర్వహణ కొనసాగిస్తున్నాం. ఉన్నతాధికారులు స్పందించి పంచాయతీ భవనానికి స్థలాన్ని కేటాయించి భవన నిర్మాణం పూర్తి చేయాలి.

–కుమార్, సర్పంచ్, అల్లంతోటబావితండా

భవనాలను నిర్మిస్తున్నాం



మండలానికి ప్రభుత్వం 20 గ్రామ పంచాయతీలను మంజూరు చేసింది. వీటిలో ఆయా గ్రామాల్లో పనులను ప్రారంభించాం. కొన్ని పంచాయతీలకు స్థలాల సమస్య ఉన్నది వాస్తవమే. రెవెన్యూ అధికారులతో మాట్లాడి ప్రభుత్వ స్థలాన్ని చూపించాలని కోరాం. స్థలం మంజూరైన వెంటనే పంచాయతీ భవనాలను నిర్మిస్తాం. పనులు ప్రారంభమైన పంచాయతీలను పూర్తి చేసేవిధంగా చర్యలు తీసుకుంటున్నాం.

–శ్రీనివాసులు, ఎంపీడీఓ, వెల్దండ

విజేతలకు బహుమతుల ప్రదానం



కుప్పగండ్లలో క్రికెట్ విజేత జట్టుకు షీల్డ్ అందజేస్తున్న నాయకులు

వెల్దండ: మండలంలోని కుప్పగండ్లలో ప్రీమియర్ లీగ్ సీజన్ –4లో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు బుధవారం బహుమతులను అందజేశారు. కుప్పగండ్ల లెజెండ్స్ జట్టు మొదటి బహుమతి, రైసింగ్ లయన్స్ టీమ్ రెండో స్థానంలో నిలిచారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు సీల్డ్‌లను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ మట్ట శారదమ్మ, ఉపసర్పంచ్ రమేష్‌ముదిరాజ్, సింగిల్‌విండో డైరెక్టర్ శేఖర్‌ముదిరాజ్, తలసాని వెంకట్‌రెడ్డి, అశోక్‌తేజ ముదిరాజ్, నాయకులు మల్లేష్, సుబ్బయ్య, వెంకటేశం, రాము, రమేష్, గఫూర్‌ఖాన్, నాగరాజుగౌడ్, రవి, తదితరులు ఉన్నారు.

మహిళలకు ముగ్గుల పోటీలు

మండలంలోని భర్కత్‌పల్లిలో మల్కేడి వీరోజి జ్ఞాపకార్థం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో హనుమాన్ దేవాలయ ఆవరణంలో రంగువల్లులు అందంగా తీర్చిదిద్దారు. ప్రతిభ కనబరిచిన మహిళలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మల్కేడి రాజు, ఉపసర్పంచ్ నర్సింహ్మ, యువజన సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

పెద్దకొత్తపల్లి: మండలంలోని మరికల్ గ్రామానికి చెందిన వెంకటయ్య ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాసులు, వార్డు సభ్యులు ఈశ్వర్ ఉన్నారు.

సీపీఐ నాయకుడికి ఘన నివాళి

తెలకపల్లి: సీపీఐ సీనియర్ నాయకుడు, పెద్దపల్లి గ్రామానికి చెందిన పెరుమాండ్ల భగవంతు(90) అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు గ్రామానికి చేరుకొని ఆయన మృతదేహంపై పార్టీ జెండాను ఉంచి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు కేశవులు గౌడ్, పెద్దపల్లి గ్రామ సీపీఐ కార్యదర్శి బుగ్గ స్వామి, సహాయ కార్యదర్శి బిచ్చలు, బాలకిష్ట తదితరులు పాల్గొన్నారు.

కొల్లంపెంటలో అంగన్‌వాడీ కేంద్రం

మన్ననూర్: అమ్రాబాద్ మండలం అటవీ లోతట్టు ప్రాంతం కొల్లంపెంటలో 'పీఎం జన్ మన్' పథకం ద్వారా అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు సూపర్‌వైజర్లు పద్మావతి, విజయమణెమ్మ, సువర్ణలు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం వారు మాట్లాడుతూ పెంటలో ప్రస్తుతం 36 కుటుంబాలు ఉన్నాయని, మహిళలు 56, పురుషులు 59, గర్భిణులు 3, బాలింతలు 2, 3–6 సంవత్సరాల లోపు పిల్లలు 9, కౌమార దశ బాలికలు 10 మంది ఉన్నారన్నారు. మొత్తం జనాభా 115 మంది ఉన్నారని స్థానిక మహిళ నాగమ్మను అంగన్‌వాడీ టీచర్‌గా ఎంపిక చేసినట్లు తెలిపారు.

తహసీల్దార్‌కు సన్మానం



పెంట్లవెల్లి: ఇటీవల తహసీల్దార్‌గా హిమబిందు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా బుధవారం కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ కబీర్, నాయకులు తహసీల్దార్‌కు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో బచ్చ శ్రీను, వార్డు సభ్యులు మూలె కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సింగిల్‌విండో వైస్ చైర్మన్ ఎన్నిక

వెల్దండ: మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో గురువారం వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి కె. శ్రీరాములు, కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ గతంలో వైస్ చైర్మన్‌గా ఉన్న సంజీవ్‌కుమార్‌యాదవ్ రాజీనామా చేయడంతో వైస్ చైర్మన్ పదవికి ఎన్నికలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పోటీచేసే అభ్యర్థులు ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు నామినేషన్ దాఖలు చేయాలని కోరారు. అదేవిధంగా 12 గంటల నుంచి 2 గంటల వరకు నామినేషన్ల పరిశీలిన, విత్‌డ్రాకు అవకాశం ఉంటుందన్నారు. సింగిల్‌విండో కార్యాలయంలో మధ్యాహ్నా 3 గంటల నుంచి 5గంటల వరకు ఓటింగ్ ద్వారా ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం ఫలితాలను వెల్లడిస్తామని ఎన్నికల అధికారి వివరించారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం



లింగాల: మండల కేంద్రానికి చెందిన కోనేటీ ఎల్లస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అతడి స్నేహితులు రూ.17 వేలను బుధవారం బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మల్లికార్జున్, శ్రీనివాసులు, రమేష్, రాజు, ఖాజా, లింగస్వామి, జీవన్, శ్రీకాంత్, సేవ్య, చిరంజీవి, పాల్గొన్నారు.

ఎనిమిది కిలోల కణతి తొలగింపు

కందనూలు: మహిళ కడుపులో నుంచి ఎనిమిది కిలోల కణతిని ఆపరేషన్ ద్వారా బుధవారం తొలగించారు. మండలంలోని మంతటి గ్రామానికి చెందిన అలివేలమ్మ కొన్నిరోజుల నుంచి కడుపు నొప్పి, రక్తస్రావంతో బాధపడుతోంది. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆమె చూపించగా ఎనిమిది కిలోల కణతి ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. వైద్యుల పర్యవేక్షణలో మహిళకు ఆపరేషన్ చేసి కడుపులో ఉన్న కణతిని తొలగించినట్లు వైద్యులు డాక్టర్ మాణిక్యాల చెన్నయ్య, మనీషా, గైనకాలజిస్ట్ డాక్టర్ అమిత్ కుమార్ తెలిపారు.

ఇంటి గోడలపై జై శ్రీరాం రాతలు

కల్వకుర్తిరూరల్: ఈ నెల 22న అయోధ్యలో భవ్య రామమందిర ప్రారంభం సందర్భంగా మండలంలోని కురుమిద్దెలో బుధవారం ఇంటి గోడలపై జైశ్రీరాం రాతలను ప్రారంభించారు. గ్రామానికి చెందిన బాలరాజు గౌడ్ మాట్లాడుతూ రాముడిపై ఉన్న భక్తిని చాటుకుంటున్నామని పేర్కొన్నారు. గ్రామస్తులు సహకరించాలని కోరారు. రాముడి ప్రాణప్రతిష్ఠపన సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఆరు గ్యారంటీలు అందరికి వర్తింపజేయాలి

కల్వకుర్తిరూరల్: ప్రజాపాలనలో ఆరు గ్యారంటీలకు దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి పథకాలు అందజేయాలని సమాచార హక్కు చట్టం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జ్ శేఖర్ ఆధ్వర్యంలో గురువారం ఎంపీడీఓ ఆంజనేయులుకు వినతి పత్రం అందజే శారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ రేషన్ కార్డులను వెంటనే మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న శేఖర్ తదితరులు

ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం



అచ్చంపేట రూరల్: పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్పస్వామి దేవాలయ నిర్మాణం కోసం అమ్రాబాద్ మండలం వెంకటేశ్వర్లబావికి చెందిన కటకం శ్రీనివాసాచారి బుధవారం అయ్యప్ప సేవ సమితి సభ్యులకు రూ.5.16 లక్షలను విరాళంగా అందజేశారు. దాతను పట్టణంలో ఘనంగా సన్మానించారు. దాతలు సహాయసహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు కపిలవాయి మహేష్‌చారి, గురుస్వాములు ప్రమోద్, హుస్సేన్, వెంకటేష్, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

అటెండర్ మృతిపై ఎంపీడీఓ నివాళి

తెలకపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న జాఫర్(50) వారం రోజుల కిందట అనారోగ్యానికి గురయ్యాడు. బుధవారం హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మృతి చెందినట్లు ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయన మృతికి సంతాపం తెలిపి నివాళులర్పించారు.

మెరుగైన సమాజాన్ని నిర్మిద్దాం



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్: కవులు, రచయితలు సహకారంతో మెరుగైన సమాజాన్ని నిర్మిద్దామని ఆ దిశగా కవితలు, రచనలు రాయాలని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. బుధవారం పట్టణంలో అభ్యుదయ రచయితల సంఘం (అరసం) సభ్యులు మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ఆ సంఘం క్యాలెండర్‌ను మంత్రి ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రజాసాహిత్యం, ప్రజాకళలకు ఎన్నటికీ ఆదరణ తగ్గదన్నారు. ప్రజలకు ఉపయోగపడే సాహిత్యాన్ని విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కవి సమ్మేళనాలు, సాహితీ సదస్సులు, శిక్షణా కార్యక్రమాలు మంచి సమాజ నిర్మాణానికి ఉపయోగపడతాయన్నారు. కవిత, రచనల్లో రాష్ట్ర సంస్కృతీ, సంప్రదాయాలు, శాస్త్రీయ, అభ్యుదయ అంశాలను ఉండాలన్నారు. కార్యక్రమంలో అరసం జిల్లా అధ్యక్షుడు కల్వకోల్ మద్దిలేటి, ప్రధాన కార్యదర్శి సాయి శంకరాచారి, రాష్ట్ర కార్యదర్శి పెబ్బేటి మల్లికార్జున్, జిల్లా కార్యదర్శులు గూడేలి శీనయ్య, నూనె క్రాంతికుమార్, సీపీఐ నాయకులు ఏసు, లక్ష్మీనారాయణ, ఈశ్వర్, నిరంజన్ తదితరులున్నారు.

కొల్లాపూర్ రూరల్: మండలంలోని రామాపురం గ్రామ సమీపంలో గుట్టపై వెలసిన వేంకటేశ్వర స్వామిని బుధవారం మంత్రి జూపల్లి కృష్ణారావు దర్శించుకున్నారు. ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం గ్రామంలో ఉన్న సమస్యలను కార్యకర్తలతో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వీరబ్రహ్మేంద్రస్వామి నాటకం



వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందాంబలకు కల్యాణోత్సవం సన్నివేశంలో కళాకారులు

వెల్దండ: మండలంలోని చెర్కూర్‌లో ఈదమ్మమాందాత బ్రహోత్సవాల్లో భాగంగా మూడురోజుల పాటు బ్రహ్మంగారి బయలు నాటకం నిర్వహించారు. మంగళవారం రాత్రి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందాంబలకు కల్యాణోత్సవం నిర్వహించారు. కళాకారులు నాటక ప్రదర్శనలో ఆకట్టుకున్నారు. నాటకాన్ని తిలకించేందుకు గ్రామస్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో దశరథరెడ్డి, అంజయ్య, గొడుగుయాదయ్య, వెంకటాచారి, భిక్షపతిచారి, రామచంద్రయ్య, ప్రశాంత్, శేఖర్, పెద్దయ్య, వెంకటయ్య, లవకుశ, ఉపసర్పంచ్ నర్సింహ్మముదిరాజ్, మాజీ సర్పంచ్ గోపాల్‌నాయక్ తదితరులు ఉన్నారు.

నర్సరీల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ



యంగంపల్లి నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కల్వకుర్తిరూరల్: మండలంలోని జీడిపల్లిలో నర్సరీని బుధవారం ఎంపీడీఓ ఆంజనేయులు పరిశీలించారు. నర్సరీలో మొక్కల పెంపకానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని హరితహారం నాటికి మొక్కలను సిద్ధం చేయాలని ఏపీఎం చంద్రసిద్దార్థ్‌కు ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ దేవేందర్, ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

తాడూరు: నర్సరీల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటునట్లు ఎంపీడీఓ గంగమోహన్ అన్నారు. బుధవారం మండలంలోని అల్లాపూర్, యంగంపల్లి, మేడిపూర్ గ్రామాల్లో నర్సరీలను ఆయన పరిశీలించారు. ప్రతి రోజు నీటిని అందించడంతో పాటు విత్తనాలు విత్తిన స్థలంలో మొక్కలు మొలకెత్తితే మరోరకమైన విత్తనాలను నాటాలన్నారు. అదే విధంగా ఉపాధి కూలీల సంఖ్యను పెంచి పనుల పట్ల కూలీలకు ఆసక్తి కలిగే విధంగా అవగాహన కల్పించాలన్నారు. నర్సరీల నిర్వహణపై కార్యదర్శులతో పాటు క్షేత్ర సహాయకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం



రోడ్డు పక్కన తేలిన కంకర

ఉప్పునుంతల: మండల కేంద్రం నుంచి మర్రిపల్లి వరకు రూ.కోటి నిధులతో మూడు కిలోమీటర్లు బీటీ రోడ్డును నిర్మించారు. రోడ్డు వెంట మట్టి వేయడంతో నిర్లక్ష్యం సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహించారు. దీంతో రోడ్డు అంచున సరిపడ మట్టి లేకపోవడంతో కంకర తేలుతోంది. ఎదురెదురుగా వాహనాలు వస్తే రోడ్డుకు కిందకు వెళ్లేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాల బారిన పడుతున్నామని ద్విచక్రవాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత కాంట్రాక్టర్ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు వెంట మట్టి వేయించే విధంగా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థినికి సన్మానం

కొల్లాపూర్ రూరల్: ఇటీవల ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో నిర్వహించిన తెలంగాణ సోషల్ వెల్ఫేర్ 7వ ఇంటర్ సొసైటీ లీగ్ స్పోర్ట్స్ కాంపిటీషన్‌లో పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థిని మధుప్రియ 800 మీటర్ల పరుగు పందెంలో సిల్వర్ మెడల్ సాధించింది. ఈ సందర్భంగా బుధవారం గురుకుల పాఠశాలల సెక్రెటరీ నికోలస్, అడిషనల్ సెక్రెటరీ హన్మంతు నాయక్, స్పోర్ట్స్ అధికారి రామలక్ష్మణ్‌లు విద్యార్థినిని సన్మానించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోత్స్న తెలిపారు.

మినహాయింపు ఇవ్వాలి

అచ్చంపేట రూరల్: మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన రంగాపూర్ ఉర్సు జాతరకు వెళ్లే ఆటోలకు రుసుము వసూళ్ల విషయంలో మినహాయింపు ఇవ్వాలని రాం రహీం లోకల్ ఆటో యూనియన్ అధ్యక్షుడు మహబూబ్‌అలీ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. అచ్చంపేట నుంచి రంగాపూర్ వరకు భక్తులు ఆటోలలో తరలివెళ్తారని పేర్కొన్నారు. తైబజారు పేరుతో రూ. 300లు వసూలు చేస్తున్నారని కనీసం కిరాయి కూడా గిట్టుబాటు కాదని వివరించారు. రంగాపూర్ గ్రామ పంచాయతీ ప్రజాప్రతినిధులు, అధికారులు, దర్గా కమిటీ సభ్యులు ఆలోచించి లోకల్ ఆటోలకు మినహాయింపు ఇవ్వాలని కోరారు.

'డబ్బులు వసూలు సరికాదు'

కొల్లాపూర్ రూరల్: పట్టణంలోని సింగోటం లక్ష్మీనరసింహ్మా స్వామి ఆలయంలో హారతి పేరుతో భక్తుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు సాయికృష్ణ గౌడ్ ఆరోపించారు. బుధవారం ఆయన సింగోటంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భక్తులకు మౌలిక వసతుల కల్పనలో ఆలయ కమిటీ సభ్యులు విఫలం అయ్యారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి డబ్బుల వసూలును అరికట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పేరుకున్న చెత్త



తాడూరు: మండల కేంద్రంలో 2వ వార్డులో మురుగు కాలువ చెత్తాచెదారంతో పేరుకుపోయింది. దీంతో మురుగు ముందుకు వెళ్లలేక ఒకేచోట నిల్వ ఉంటోంది. దీంతో దుర్గంధ వాసన వెదజల్లుతోందని వార్డు ప్రజలు వాపోయారు. దోమలు బెడద అధికం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మురుగు కాలువను శుభ్రం చేయించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.